
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం, 6, అక్టోబర్, 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 29.201 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 2,743 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.58,350
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,257
3 శాతం జీఎస్టీతో..	రూ.5,415
సవర (8 గ్రా)	రూ.43,320



వాతావరణం

గురువారం గాలిలో తేమ 61 శాతం ఉంది. శుక్రవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు, ఉక్కపోత ఎక్కువగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

98.85 శాతం మందికి పింఛన్ల పంపిణీ



సంగం మండలం మక్తాపురానికి చెందిన పెంచలమ్మకు నెల్లూరులోని ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఎ.వెంకట సంధ్య

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ పూర్తయింది. ఐదో రోజు గురువారం జిల్లాలోని 98.85 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ నగదు అందజేశారు. జిల్లావ్యాప్తంగా 3,17,722 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక అందజేయాల్సి ఉండగా, 3,14,053 మందికి పంపిణీ చేశారు. వలంటీర్లు గత ఐదు రోజులుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, వారు ఉండే ప్రాంతాలకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు.

నేటి నుంచి న్యాయవాదుల విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్): కోర్టులో పిటిషన్లకు రూ.1 స్టాంపు ఉండేది. ఇకపై పిటిషన్లకు రూపాయితోపాటు మరో రూ.20 స్టాంపు అంటించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై చట్ట వ్యతిరేకంగా నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వ్యవహరించిన తీరుకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం అత్యవసర కమిటీ సమావేశం నిర్వహించి కోర్టు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

సీతారామపురంలో నేడు 'జగనన్నకు చెబుదాం'

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని శుక్రవారం సీతారామపురంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామపురంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని తెలిపారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించండి



చెక్కు అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లా హోంగార్డ్స్ యూనిట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి హోంగార్డులకు సూచించారు. గురువారం నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో విజయవాడ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ కేవీ ప్రేమ్‌జిత్ ఆధ్వర్యంలో హోంగార్డ్స్ దర్బార్ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులతో సమానంగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన హోంగార్డు అరుణకుమారికి జిల్లాలోని హోంగార్డులు ఒక రోజు వేతనం రూ.3,86,240 ఇవ్వగా, ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో మృతురాలి కుమారుడు యశ్వంత్‌కు ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ డీఎస్పీ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్ పొదలకూరు రోడ్డులోని పీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్షలో పేర్లు నమోదు చేసుకుంటున్న నగరవాసులు



కార్యక్రమానికి వచ్చిన వారికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

వైద్యం.. సువర్ణ అధ్యాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ సువర్ణ అధ్యాయం లిఖించారు. వైద్యులు పల్లె ప్రజల చెంతకు వెళ్లి నాడి పట్టేలా చర్యలు చేపట్టారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గత వారం రోజులుగా జిల్లాలోని ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ వైద్య సేవల్లో బీపీ, షుగర్, నేత్ర, రక్త పరీక్షలతోపాటు అవసరమైన ముఖ్యమైన వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.



వృద్ధురాలికి ఆక్సిజన్ అందిస్తున్న దృశ్యం



రోగులకు రక్త పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

ఫొటోలు – సాక్షి, ఫొటోగ్రాఫర్

ఉల్లంఘనులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): అనుమతులు లేకుండా నగరంలో ర్యాలీ నిర్వహించిన టీడీపీ నాయకులతోపాటు పాల్గొన్న సీపీఐ, జనసేన నేతలపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రజాజీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు, సభలు, ర్యాలీలు నిర్వహించరాదని, నలుగురికి మించి బహిరంగ ప్రదేశాల్లో గుమికూడరాదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఈ నెల 4వ తేదీన జరిగిన ర్యాలీకి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. అయినప్పటికీ పోలీసు హెచ్చరికలను బేఖాతరు చేస్తూ టీడీపీ నేతలు నగరంలోని వీఆర్సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీపీఐ, జనసేన నేతలు సైతం పాల్గొన్నారు. 144 సెక్షన్ ఉల్లంఘనపై చిన్నబజారు ఏఎస్సై సుబ్బరాజు ఫిర్యాదు మేరకు నెల్లూరురూరల్, వెంకటగిరి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, కంభం విజయరామిరెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, టీడీపీ నేతలు పనబాక భూలక్ష్మి, మాలేపాటి సుబ్బానాయుడు, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రాజా యాదవ్, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులపై చిన్నబజారు ఎస్సై సుధీర్‌కుమార్ కేసు నమోదు చేశారు.

9 వరకు ఈకేవైసీ గడువు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో పంటల సాగుకు సంబంధించి ఈకేవైసీ నమోదు గడువు ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు గురువారం తెలిపారు. ఇప్పటి వరకు 94 శాతం ఈకేవైసీ నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన సాగును నమోదు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

ఏపీపీటీడీ కార్గోలో రూ.1,000 కోట్ల లక్ష్యం

- డైరెక్టర్ ఎ.రాజారెడ్డి

నెల్లూరు సిటీ: ఏపీ ప్రజా రవాణా శాఖ పార్సిల్ సర్వీస్ కార్గో ద్వారా ఇప్పటికి రూ.220 కోట్లు ఆదాయం వచ్చిందని, మరో 4 నెలల్లో రూ.1000 కోట్లు లక్ష్యం నిర్దేశించుకున్నట్లు ఏపీపీటీడీ డైరెక్టర్ ఎ.రాజారెడ్డి తెలిపారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020లో 51,488 మంది ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అని తెలిపారు. ఉద్యోగుల జీతభత్యాలను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రెవెన్యూ పెంచుతూ కొత్త బస్సులు, కొత్త ఉద్యోగులను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్గో పార్సిల్ ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కార్గో సేవలు బాగున్నాయని అభినందించారు. గతేడాదితో పోలిస్తే 20 శాతం ఆదాయం పెరిగిందని తెలిపారు. సమావేశంలో కార్గో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కేవీ రమణ, ఐ.సురేష్‌బాబు, రాజశేఖర్, నెల్లూరు కార్గో మేనేజర్ ఎం.దివ్య కామాక్షి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెవెన్యూ, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై జిల్లాలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు బాల్య వివాహాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ, పోలీసు, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంగా పనిచేస్తూ కౌమారదశలో ఉన్న బాలికల సాధికారిత, బాల్య వివాహాల నిరోధానికి చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని డీఆర్వోను ఆదేశించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పాఠశాలల్లో ప్రచార, అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా కార్యక్రమాలను రూపొందించాలని అధికారులకు తెలిపారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీఈఓ గంగాభవాని, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన పాల్గొన్నారు.

16 నుంచి ఈవీఎంల తనిఖీ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుంచి ఈవీఎంల మొదటి దశ తనిఖీలు చేపట్టనున్నామని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ తెలిపారు. ఓటరు జాబితాకు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈవీఎంల తనిఖీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఈ నెల 27న సమీకృత ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని డిసెంబర్ 26వ తేదీకల్లా పరిష్కరిస్తామని తెలిపారు.

నక్కల కాలువకు మహర్దశ

జిల్లాలోని మేజర్ డ్రెయిన్లలో ఒకటైన నక్కల కాలువ సింహభాగం సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరు, వెంకటాచలం మండలాల్లో ప్రవహిస్తుంది. మూడు దశాబ్దాల క్రితం అభివృద్ధికి నోచుకున్న ఈ డ్రెయిన్ క్రమంగా నిరాదరణకు గురైంది. పూర్తిస్థాయిలో పూడిపోయిన ఈ నక్కల కాలువకు ప్రస్తుతం మహర్దశ పట్టింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృషితో నక్కల కాలువ అభివృద్ధికి రూ.4.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పూడికతీసే పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఫలితంగా రెండు మండలాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.4.30 కోట్లతో అభివృద్ధి

- నెరవేరిన రైతుల కోరిక
- మంత్రి కాకాణి కృషి ఫలితం
- పూడికతీత పనులు ప్రారంభం



ప్రస్తుతం నక్కల కాలువ పరిస్థితి



నక్కలకాలువ పూడికతీత పనులు జరుగుతున్న దృశ్యం

ముత్తుకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మేజర్ డ్రెయిన్లు మొత్తం నాలుగు ఉన్నాయి. అవి నక్కల కాలువ, పైడేరు, మలిదేవి, అల్లూరు ర్యాంప్. భారీ వర్షాలు, తుపాను సమయాల్లో పంట పొలాలను ముంచెత్తకుండా వరదనీటిని ఉప్పుటేరుకు తరలించడంలో నక్కలకాలువ ప్రధాన పాత్ర పోషిస్తోంది. అలాగే, సర్వేపల్లి రిజర్వాయర్ నీటిమట్టం ప్రమాదస్థితికి చేరకుండా ఎప్పటికప్పుడు వరదనీటిని 15 తూముల ద్వారా నక్కలకాలువలో సంగ్రహిస్తోంది. పంట పొలాలను సంరక్షిస్తోంది. 1992లో అప్పటి ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి ప్రపంచ బ్యాంక్ నిధుల ద్వారా ఈ మేజర్ డ్రెయిన్ అభివృద్ధికి కృషి చేశారు. ఆ తర్వాత వచ్చిన పాలకులు దీనిని పూర్తిగా విస్మరించారు. ఫలితంగా పిచ్చిమొక్కలు, తూటాకు, ముళ్ల చెట్లతో పూడిపోయింది. అక్కడక్కడా కుంచించుకుపోయింది. కొన్నిచోట్ల ఆక్రమణలకు గురైంది. భారీ వర్షాల సమయంలో ఈ డ్రెయిన్ వరద నీటిని తరలించలేని స్థితిలో తరచూ పంట పొలాలు ముంచెత్తడం, పైర్లు, వరినార్లు నీట మునగడం సర్వసాధారణమైంది. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా ఈ డ్రెయిన్‌కు ఇరువైపులా ఉన్న గ్రామాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరి సాగులో తీవ్రంగా నష్టపోతున్నారు.

సాయం చేయని చంద్రబాబు

2015 నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పంటపొలాలు, రొయ్యల చెరువులు మునిగిపోయాయి. పూడిపోయిన నక్కలకాలువ వరద నీటిని తరలించలేకపోవడంతో పొలాలు, రొయ్యల చెరువులను వర్షపునీరు ముంచెత్తింది. ఫలితంగా వరి, ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నక్కలకాలువ దుస్థితిని స్వయంగా పరిశీలించారు. రైతులు కన్నీటితో తమ కష్టాలను చెప్పుకున్నారు. అయితే, రైతులను ఆదుకొంటామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ తర్వాత పూర్తిగా మొహం చాటేశారు. టీడీపీ పాలనలో నక్కలకాలువ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని రైతులు ఆరోపిస్తున్నారు. రెండుసార్లు మంత్రిగా పనిచేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా దీని అభివృద్ధిని విస్మరించారు.

రైతుల కోర్కె తీర్చిన కాకాణి

భారీ వర్షాలకు తరచూ నష్టపోతున్న రైతులు సర్వేపల్లి ఎమ్మెల్యే హోదాలో ఉన్నప్పుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పలుమార్లు నక్కలకాలువ దుస్థితిని విన్నవించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అయిన తర్వాత కాకాణి ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో పంటలు కాపాడాలన్న ఉద్దేశంతో సొంత నిధులతో నక్కలకాలువలో పూడికతీసే పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే, మాజీ మంత్రి సోమిరెడ్డి దీనిని రాజకీయం చేసే ప్రయత్నం చేశారు. ఫలితంగా రెండు మండలాల రైతులు ఏకమై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమిరెడ్డి విమర్శలను తిప్పికొట్టారు. ఈ క్రమంలో 13.8 కిలోమీటర్ల పొడవునా ఈ డ్రెయిన్ అభివృద్ధి చేసేందుకు మంత్రి కాకాణి నవంబర్ 15న శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రూ.430.45 లక్షలు మంజూరు చేయించారు. దీనితో రీచ్‌ల వారీగా పనులు మొదలయ్యాయి. రాజకీయ పార్టీలకు అతీతంగా రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తోంది. ఇదేవిధంగా పొట్టెంపాడు వద్ద నక్కలకాలువపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి పునర్నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు సాధించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాది క్రితం ముత్తుకూరు మండల పర్యటనకు వచ్చిన సందర్భంగా ఈ బ్రిడ్జి దుస్థితి గురించి రైతులు వివరించడంతో ముఖ్యమంత్రి అక్కడికక్కడే రూ.10 కోట్లు మంజూరు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందనేందుకు ఇదొక నిదర్శనం.

30 ఏళ్ల తర్వాత నక్కలకాలువ అభివృద్ధి



నక్కలకాలువను గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. దీని వల్ల వరద ముంపునకు ఏటా రెండు, మూడు సార్లు నార్లు పోసుకోవాల్సిన దుస్థితి వస్తోంది. తాత్కాలిక పనులు చేపడితే ఓర్వలేక రాజకీయం చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృషి వల్ల 30 ఏళ్ల తర్వాత నక్కలకాలువను అభివృద్ధి చేయడం సంతోషంగా ఉంది.

– కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వెంకటాచలం

గత పాలకులు నిర్లక్ష్యం చేశారు



మేజర్ డ్రెయిన్ నక్కలకాలువ అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా భారీ వర్షాలు, వరదలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. చివరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృషితో ఈ డ్రెయిన్ అభివృద్ధికి నోచుకుంది.

– పల్లంరెడ్డి జనార్దన్‌రెడ్డి, రైతు, పొట్టెంపాడు

15 గ్రామాలకు ప్రయోజనం



నక్కలకాలువ అభివృద్ధి చేయడం వల్ల 15 గ్రామాలకు వరి సేద్యానికి, రొయ్యల పెంపకానికి ఎంతో ప్రయోజనం. ఇక నుంచి భారీ వర్షాలకు ముంపు భయం ఉండదు. రైతులు ఎంతో ఆనందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నాం.

– దువ్వూరు కోదండరామిరెడ్డి, రైతు, పోలంరాజుగుంట

శాస్త్రసాంకేతిక రంగాల్లో
భారత్ స్థానం ప్రత్యేకం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- భారత అంతరిక్ష వారోత్సవాల ప్రారంభంలో ఎమ్మెల్యే మేకపాటి

సంగం: ఆధునిక ప్రపంచంలో శాస్త్రసాంకేతిక రంగాల్లో భారత్ స్థానం ప్రత్యేకమైందని, అతి తక్కువ ఖర్చుతో అంతరిక్ష ప్రయోగాలు చేయగల సత్తా మన శాస్త్రవేత్తలకు ఉందని, భవిష్యత్తులో ఇక్కడి నుంచే ఇతర దేశాలు ప్రయోగాలు చేపట్టే విధంగా అభివృద్ధి సాధిస్తుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. స్థానిక జీబీకేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత అంతరిక్ష వారోత్సవాలను ఇస్రో శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. తొలుత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను చదువుకునే సమయంలో కంప్యూటర్ వినియోగం అప్పుడప్పుడే ప్రారంభమైందని, ప్రస్తుతం కంప్యూటర్ లేనిదే ఏ పనిచేయలేని పరిస్థితిల్లోకి వచ్చామన్నారు. ఈ నలభైఏళ్ల కాలంలో సాంకేతికాభివృద్ధి ఏ విధంగా జరిగిందో ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు అంతరిక్ష వారోత్సవాలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. శాస్త్రసాంకేతిక అభివృద్ధికి సంబంధించి శిక్షణా సంస్థల ఏర్పాటుకు తమ పూర్తి సహకారం అందిస్తామన్నారు. రానున్న 40 ఏళ్లలో ప్రపంచ దేశాలు మనవైపు చూసేలా శాస్త్రసాంకేతిక రంగాల్లో మన దేశం అభివృద్ధి సాధించనుందన్నారు. ఆ అభివృద్ధిలో భావితరాలను భాగస్వాములను చేయాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలతో ఆధునిక విద్య విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి లక్షల కోట్లు ఖర్చుపెట్టి మన ముఖ్యమంత్రి భావితరాల ఉజ్వల భవితకు బాటలు వేస్తున్నారన్నారు. ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతస్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు.

రాబోయే ఎన్నికల్లో
వైఎస్సార్‌సీపీని ఆదరించాలి


ఒకటో డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఒకటో డివిజన్, నారాయణరెడ్డిపేటలో పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నారాయణరెడ్డిపేట, కోడూరుపాడు ప్రాంతాలతో తనకు ఎన్నో ఏళ్ల అనుబంధం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఒకటో డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయిలతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ప్రస్తుతం రూ.1.50 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కర్మక్రతువుల భవనం, కమ్యూనిటీహాల్, శ్మశానంలో భవన నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారధిలా వ్యవహరిస్తూ పారదర్శకంగా ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవాలు ఏ మాత్రం లేవన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నాయకుడు కోడూరు కమలాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, స్థానిక కార్పొరేటర్ నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, హరిబాబు యాదవ్, మన్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు గౌరి, రామ్మోహన్, శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్, నాయకులు పాలకీర్తి రవి, జీవీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములను కాజేసిన నారాయణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అమరావతిలో దాదాపు రూ.820 కోట్ల విలువ చేసే పేదలకు సంబంధించిన అసైన్డ్ భూములను చౌకగా రూ.18 కోట్లకు కాజేసిన నీచ చరిత్ర మాజీ మంత్రి నారాయణదని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విమర్శించారు. నగరంలోని రాజన్న భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి భూకుంభకోణంలో నారాయణ పాత్రను ఆధారాలతో సహా సీఐడీ గుర్తించిందన్నారు. ఈ కుంభకోణంపై విచారణకు పిలిస్తే ఆరోగ్యం సరిగా లేదని, సర్జరీలు చేయించుకున్నానని, విచారణకు నేరుగా రాలేనని చెప్పడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు ప్రతిరోజూ నెల్లూరుకు వచ్చి దీక్షలో పాల్గొనేందుకు, ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు, వైట్‌కాలర్ మాదిరి నటిస్తూ తిరిగేందుకు మాత్రం నీకు ఓపిక ఉందాని ప్రశ్నించారు. కుంటి సాకులతో కోర్టును కూడా మోసం చేస్తున్నారన్నారు.

దొంగే దొంగ అన్నట్లుగా టీడీపీ తీరు

టీడీపీ నాయకుల తీరు దొంగే దొంగ అన్నట్లుగా ఉందని, ఓటర్ల ప్రక్రియలో మోసాలకు పాల్పడుతూ తమపై బురదజల్లుతున్నారని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ అన్నారు. నగరంలో దొంగ ఓట్లు చేర్పించే సత్తా విద్యా సంస్థలు కలిగిన వారికే ఉంద ని, తమకు లేదన్నారు. నారాయణ కళాశాలను అడ్డం పెట్టుకుని ఓట్లు చేర్చుకుంటూ తమపై నిందలు వేయడం సబబు కాదన్నారు. వైఎస్సార్‌సీపీకి బలమున్న ప్రాంతాల్లో బతికున్న వారిని చనిపోయినట్లుగా చూపిస్తూ ఓట్లు తొలగించడం సిగ్గుచేటన్నారు. ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్న నారాయణ సిబ్బందిపై కేసులు నమోదు చేయిస్తామన్నారు. ప్రజల ఆశీస్సులు, భగవంతుడి దీవెనలు ఉన్నంత కాలం తనకేమీ ఇబ్బంది లేదన్నారు. నారాయణ ఆస్పత్రిలో తెలిసిన వారికి కూడా ఒక్క రూపాయి తగ్గించకుండా బిల్లులు చెల్లించుకుంటూ కనికరం లేకుండా ప్రవర్తిస్తున్న నారాయణ వంటివారు కూడా తమపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, నగర నియోజకవర్గ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు, అనంత జట్ల విజయం


తలపడుతున్న నెల్లూరు, కడప జట్లు

కడప స్పోర్ట్స్: ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 189 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు గురువారం బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 88.4 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 280 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 101 పరుగులు, రేవంత్‌రెడ్డి 79 పరుగులు చేశారు. కడప బౌలర్లు ఆదిల్‌హుస్సేన్ 3, అస్లాం 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 52.2 ఓవర్లలో 211 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని వాసుదేవరాజు 35 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు భార్గవ్ 5, అఖిల్ 3 వికెట్లు తీశారు. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 354 పరుగులు చేయగా, కడప జట్టు 186 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టు 237 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా మరో మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై అనంతపురం జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో



నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి: రూ.65
సన్నవి: రూ.30
పండ్లు: రూ.7





ఫారము నెం 1 (See Rule 16(3))
నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా)
" (ఆత్మకూరు మునిసిపాలిటీ మాస్టర్ ప్లాన్ యొక్క ప్రకటన అభ్యంతరాలు మరియు సూచనలు కోరడమైనది) "

ఆర్.సి.నెం. 568/2023/నుడా తేది : 06.10.2023

(ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్ 2016 లోని సెక్షన్ 12 లోని సబ్ సెక్షన్ 1 మరియు ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూల్స్ 2018 లోని రూల్ (16) లోని సబ్ రూల్ (3) క్రింద జారీ చేయబడిన నోటీసు)

1. ఆత్మకూరు మునిసిపాలిటీ, డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్, నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ దిగువ కనబరచిన షెడ్యూల్‌లోని విస్తీర్ణమునకు తయారు చేసి ఈ నోటీసు జతపరుస్తూ ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూల్స్ 2018 లోని రూల్ (16) లోని సబ్ రూల్ (3) క్రింద ప్రచురించడమైనది.
2. ఆత్మకూరు పురపాలక సంస్థ కార్యాలయం, ఆత్మకూరులోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ యొక్క ప్రతిపాదనకు చెందిన మ్యాపులను ఎటువంటి రుసుము లేకుండా సందర్శించవచ్చును.
3. మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల యందు ఆసక్తి గల ఎవరేని వ్యక్తి తన అభ్యంతరాలను మరియు సూచనలను కమీషనర్, ఆత్మకూరు పురపాలక సంస్థ కార్యాలయము / వైస్ చైర్మన్, నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా), నెల్లూరు వారికి వ్రాతపూర్వకముగా కానీ ఈ మెయిల్ ద్వారా nudaoffice@gmail.com/amcmunicipality2012@gmail.com కు గాని 30 రోజులలోగా 5-11-2023 వరకు పంపవచ్చును.

షెడ్యూలు :- జి.ఐ.యస్ ఆధారిత మాస్టర్ ప్లాన్, ఆత్మకూరు టౌన్, SPSR నెల్లూరు జిల్లా.
1. ప్రస్తుత భూ వినియోగ పటము, 2. ప్రతిపాదిత భూ వినియోగ పటము

ప్లానింగ్ ఏరియా సరిహద్దులు :- తూర్పు : కోదూరుపాడు, వాసిలి, అనుమసముద్రము, **పడమర :** నాగులపాడు, నారంపేట, చిరువెళ్ళ కండ్రిక, బోయిల్లా చిరువెళ్ళ, **ఉత్తరం :** పమిడిపాడు, పొనుగోదు, **దక్షిణం :** కోలగట్ల, బట్టేపాడు, నువ్వూరుపాడు.

టి.బాపిరెడ్డి
వైస్‌చైర్మన్, నుడా, నెల్లూరు

జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వింజమూరులోని సచివాలయం–2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడొచ్చినా రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రముఖ జాతీయ మీడియా సంస్థల సర్వేలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ఇందుకు కారణం సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలేనన్నారు. వైఎస్సార్‌సీపీ బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలుస్తుందన్నారు. టీడీపీ పెత్తందారుల పార్టీ అని విమర్శించారు. 2014 ఎన్నికల్లో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఆయన పాపం పండడంతో కటకటాల పాలయ్యారన్నారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైనా సీఎం వైఎస్ జగన్ ముందు చూపుతో అభివృద్ధిలో దేశంలోని పెద్ద రాష్ట్రాలతో పోటీ పడుతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు పల్లాల కొండారెడ్డి, కాలేషా, మద్దూరు బాలకృష్ణ, గణపం రమేష్‌రెడ్డి, ఆనంగి రాజేష్, పోలుబోయిన వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాతను చూసేందుకు వస్తుండగా..


గౌరవరం వద్ద ప్రమాదానికి కారణమైన ఆటోను పరిశీలిస్తున్న ఎస్సై సుమన్


సురేంద్ర మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుమన్

- ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో
- బాలుడి మృతి
- తల్లి,చెల్లితో పాటు మరో మహిళకు గాయాలు

కావలి: తాతను చూసేందుకు వస్తుండగా మితిమీరిన వేగంతో వెళ్తూ ఆటో అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. బాలుడి తల్లి,చెల్లితో పాటు మరో మహిళ స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషాదకర ఘటన గౌరవరం సమీపంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు..ఒంగోలులో నివాసం ఉంటున్న కుట్టుబోయిన శ్రావణి కడనూతలలో ఉంటున్న తన తండ్రిని చూసేందుకు తన ఇద్దరు చిన్నారులు మోహన్ విశ్వక్సేన్(5), నాలుగేళ్ల పాప సహస్రతో కలిసి బస్సులో గురువారం కావలికి వచ్చింది. అక్కడి నుంచి ఆటోలో కడనూతలకు బయలుదేరింది. గౌరవరం సమీపంలోకి వచ్చేసరికి ఆటో డ్రైవర్ మితిమీరిన వేగంతో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారి మోహన్‌విశ్వక్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి శ్రావణి, పాప సహస్ర స్వల్పంగా గాయపడ్డారు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న గౌరవరానికి చెందిన మరో మహిళ పూసిపాటి చిన్నమ్మ స్వల్ప గాయాలతో బయటపడింది. కళ్లెదుటే కుమారుడు మృతి చెందడంతో తల్లి కన్నీరుమున్నీరైంది. ప్రమాద ఘటన స్థలాన్ని ఎస్సై సుమన్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి

కావలి మండలం చెన్నాయపాళెం క్రాస్‌రోడ్స్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు..దుత్తలూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దేవేండ్ల సురేంద్ర (38) తన ద్విచక్ర వాహనంపై ఒంగోలు నుంచి కావలికి వస్తున్నాడు. చెన్నాయపాళెం క్రాస్‌రోడ్స్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని అదుపుతప్పి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

మోటారు
దొంగలకు రిమాండ్

జలదంకి: బ్రాహ్మణక్రాక మేజర్ కాలువ, జలదంకి లేదోటి గంగమ్మచెరువు పొలాల వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లను అపహరించిన కేసులో ఇద్దరు దొంగలను గురువారం కోర్టులో హాజరుపరచగా వారికి రిమాండ్ విధించినట్లు ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు. కావలి ప్రాంతానికి చెందిన జంపా జోసఫ్, బుట్టి రఘు గత కొంతకాలంగా జలదంకి మండలంలోని రైతుల మోటార్లను అపహరించుకెళ్తున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిఘా ఉంచారు. జలదంకిలో దొంగలను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

చేజర్ల తహసీల్దార్‌గా పీ కృష్ణ

నెల్లూరు(దర్గామిట్ట): చేజర్ల మండల తహసీల్దార్‌గా పీ కృష్ణను నియమిస్తూ గురువారం సాయంత్రం కలెక్టర్ ఎం హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. చేజర్ల తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉన్న నేపథ్యంలో వెంకటాచలం మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న పీ కృష్ణను అక్కడకు బదిలీ చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.138
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్:	రూ.238
స్కిన్‌లెస్ చికెన్:	రూ.264
లేయర్ చికెన్:	రూ.200



కోలుకుంటున్న పెట్రోల్ దాడి బాధితురాలు

- పోలీసుల అదుపులో నిందితుడు పుట్టయ్య
- కేసు దర్యాప్తు వేగవంతం


చెన్నైలోని ఆస్పత్రిలో సునందను విచారిస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు: మండలంలోని వీరంపల్లి సమీపంలో మూడ్రోజుల క్రితం జరిగిన పెట్రోల్ దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన సునంద చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కోలుకుంటోంది. గురువారం మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్ చెన్నైకు వెళ్లి బాధితురాలితో మాట్లాడారు. బంధువుల సమాచారం మేరకు వివరాలు నమోదు చేసుకుని కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. పెట్రోల్‌తో దాడికి పాల్పడిన నిందితుడు పుట్టయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. జంగాలపల్లికి చెందిన సునంద, నిందితుడు పుట్టయ్య మధ్యన చాలాకాలంగా స్నేహం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సునందకు పుట్టయ్య సెల్‌ఫోన్ కొనిచ్చాడని తెలిసింది. సునందకు ఫోన్ చేసిన చాలా సందర్భాల్లో ఎంగేజ్ వస్తుండడంతో తనతో కాకుండా వేరే వ్యక్తితో కూడా స్నేహం కొనసాగిస్తుందనే అనుమానంతో ఆమె మీద పుట్టయ్య కక్ష పెంచుకున్నాడు. ఆమెపై పథకం ప్రకారం దాడి చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. దాడికి పాల్పడిన రోజు కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద హైవే పక్కనున్న పెట్రోల్ బంకులో బాటిల్‌లో పెట్రోల్ పట్టించుకున్నాడు. ఇది తెలియని సునంద తాను పొదలకూరుకు వెండి పట్టీలు కొనేందుకు స్నేహితురాలు మనోజతో కలిసి స్కూటీపై వెళుతున్నానని పుట్టయ్యకు సమాచారం ఇచ్చింది. దీంతో బైక్‌పై వెంబడించిన పుట్టయ్య ముందుగా అనుకున్న ప్రకారం వీరంపల్లి సమీపంలో స్కూటీని ఆపి పొలాల్లోకి వెళ్లిన సునందపై దాడికి పాల్పడ్డాడు. ముఖంపై పెట్రోల్ పోసి నిప్పంటించగా ఆమె కేకలు వేస్తూ తప్పించుకుని పరిగెత్తింది. దీంతో పుట్టయ్య పరారయ్యాడు. ఈ క్రమంలో సునంద స్నేహితురాలు మనోజను స్కూటీ వద్ద చూసిన పుట్టయ్య దాడి విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించినట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR
■ **Last Chance:** 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629 [T-4637]

REAL ESTATE

FLAT FOR SALE
■ **RTC** దగ్గర, అరవింద నగర్, ట్రింగ్ నెట్ అపార్ట్‌మెంట్ 1650 చ॥అ॥ల, 3బెడ్ రూమ్ ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. ఫోన్ : 82979 79596, 90250 85283 [V- 2182]

PLOT FOR SALE
■ నరుకూరు సెంటర్‌కు అతి సమీపంలో అంకణం 80వేలకే NUDA Approved ప్లాట్లు అమ్మబడును. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సంప్రదించండి. 62814 11178, 91214 52347. [NA-11543]

■ **DTCP** అప్రూవ్డ్ లే అవుట్‌లో నెల్లూరు నగరంలో ప్లాట్లు అమ్మకానికి కలవు. వివరములకు సంప్రదించండి: 8977666665. [N-1189096]

■ **Open Plots :** అం॥30వేలు to 1లక్ష, ధనలక్ష్మీపురం, అల్లీపురం, కసుమూరు, రాజుపాళెం, గూడూరు, పొదలకూరు. క్లియర్ టైటిల్స్ & స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్రదించండి: 88856 83888. [NA-22764]

TO-LET
■ నెల్లూరు, పొగతోటలో గ్రౌండ్ ఫ్లోర్ నందు కన్సల్టేషన్ రూమ్స్, ఇన్ పేషంట్ రూమ్స్, బెడ్ లిఫ్ట్, జనరేటర్ మరియు అన్ని ఫెసిలిటీస్ తో హాస్పిటల్స్‌కి అనువైన నార్త్ ఈస్ట్ కార్నర్ (కేర్ డెంటల్ బిల్డింగ్) నందు రెంట్‌కి కలదు. సంప్ర: 86861 78918, 94406 66777. [NA-10549]

SERVICES

BUSINESS OFFER
■ నెల్లూరు సిటీలో రన్నింగ్‌లో ఉన్న సూపర్ మార్కెట్ అమ్మబడును లేదా పెట్టుబడి పెట్టగల వారికి పార్టనర్‌షిప్ ఇవ్వబడును. ఆసక్తి గల వారు సంప్రదించండి సెల్ : 70326 10569. [NA-5921]

WANTED
■ **Wanted Computer Faculty,** MS Office, Tally, GST. Salary : 10K to 20K (Work in Nellore). Contact: 7569478732. [NA-5924]

■ **Urgently required Female Telecallers** for Bank purpose to HDFC Bank in Nellore. Further Details Contact : 63025 31029, 63001 84465. [NA-5929]

■ **Urgent Requirement for Collection Executives in HDFC Bank Collections Department. Nellore, Atmakur Location,7569326028, 9985862109.** [T-764085]

■ సెక్యూరిటీ ASO's, S/Gds, Lady S/Gds డేవిస్‌పేట / మహాలక్ష్మీపురంకి 10th పాసైన వారు కావలెను. జీతం : 12వేలు. వివరాలకు సంప్ర : 99510 72170, 90102 14397. [N-1231507]

■ నెల్లూరు సిటీ అమెజాన్ నందు వర్క్ చేయుటకు డెలివరీ బాయ్స్ - నైట్ డ్యూటీ బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 93912 40756,79936 91149. [NA-22758]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221757]

■ కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు, ప్రముఖుల ఇళ్ళ వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కావలెను. Sal: 14-20K వసతి + భోజనం, విజయవాడ ✆ 91608 35559, 78158 35561 [B-385]

■ నెల్లూరు, బుజబుజ నెల్లూరు పరిసర ప్రాంతాలలో ప్రముఖ కంపెనీలలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వివరాలకు సంప్రదించండి : 99484 25418. [N-1231823]

■ ప్రముఖ కంపెనీ నందు పని చేయుటకు డ్రైవర్లు కావలెను. సంప్ర : ప్లాట్ నెం: 40, ఉడ్ కాంప్లెక్స్, అయ్యప్పగుడి, ఫ్లై ఓవర్ దగ్గర, నెల్లూరు. సెల్ : 99636 62656, 83095 56900. [NA-5927]

■ నెల్లూరు కొండాయపాళెం ఏరియాలో పని చేయుటకు సెక్యూరిటి ఆఫీసర్. జీ:19,000, హెడ్ గార్డ్స్ జీ:17,000, 12గం॥డ్యూటీ, Qf: ఇంటర్, డిగ్రీ. సెక్యూరిటి అనుభవం కావలెను. 99594 44086. [NA-22756]

■ బ్యాంక్ లోన్స్ ప్రాసెస్ నందు **Telecaller** కావలెను. Married Female, టార్గెట్స్ లేవు, జీతం : 12,000/-. ట్రంక్‌రోడ్, నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 8885802000. [NA-22760]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221732]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం:18K. Ph:9640468899/ 9640258899 [HA-189338]

■ నెల్లూరు టౌన్‌లో ఇన్నోవా కారు నడుపుటకు అనుభవం ఉన్న డ్రైవర్ కావలెను. యువకులకు మరియు లోకల్స్ వారికి మొదటి ప్రాధాన్యత Ph: 7075332799 [HA-678]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP&డాక్టర్స్ కావలెను. జీతం: 13,000/- - 35000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph: 7995374999 [HA-684]

■ రాఘవ ఆటో ఫైనాన్స్ నందు పని చేయుటకు అకౌంటెంట్ (M) కావలెను. అర్హత : B.Com (Tally), B.Tech or MBA, వయస్సు : 23–32 సం॥ & ఆఫీస్ స్టాఫ్ (M) కావలెను. అర్హత : డిగ్రీ. సంప్ర : 79934 54965, 91000 55963. [NA-5926]

■ రామకృష్ణ హోంకేర్ సర్వీసెస్ (AP NO-1) VJA, HYD శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, వంట/ ఇంటి పని, బేబీ కేర్ వర్కర్స్ కావలెను భో+వ+జీ: 15-21 వేలు ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 62812 08656, 62812 08600 [B-1068140]

■ నెల్లూరు సిటీలో ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు 40 సం. లోపు స్టాఫ్ అసిస్టెంట్స్ 10 మంది. అర్హత (ఏదైనా డిగ్రీ) లోకల్ వారికి ప్రాధాన్యత. అకౌంటెంట్స్ -3, డ్రైవర్లు -2 కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్ : 94942 88807. [NA-22765]

■ నెల్లూరులో ప్రముఖ FMCG కంపెనీలో పని చేయుటకు సేల్స్‌మెన్ (జీతం: 20,000), ఆపరేటర్స్ (జీతం: 15000), గోడౌన్ ఇన్‌చార్జ్, క్యాషియర్స్ (15000), డ్రైవర్స్ & డెలివరీ బాయ్స్ కావలెను. సంప్ర : 83743 44449, 77990 68899. [NA-22766]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.